నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 14 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మహారాష్ట్రలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఇరు రాష్ట్రాల అధికారులు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అలర్ట్

మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు జిల్లాల పోలీసులతో నాగపూర్ ఐజీ సమావేశం

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర, తెలంగాణ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఇరు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులతో నాగపూర్ ఐజీ చెరింగ్ డోర్జే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. చంద్రపూర్ జిల్లా ఎస్పీ ఎం సుదర్శన్, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ ఎస్పీలు సురేశ్ కుమార్, గౌస్ ఆలం, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, చంద్రాపూర్ కలెక్టర్ వినయ్ గోద్వ, యావత్మల్ ఎస్పీ పవన్ ధన్‌సూద్, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ వేణు ఈ సమావేశానికి హాజరయ్యారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ ఎస్పీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగపూర్ ఐజీ మాట్లాడుతూ ఇరు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా సాగేలా కృషిచేయాలన్నారు. సరిహద్దుల వద్ద భద్రతా చర్యలు పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. నేరాల కట్టడి, కేసుల విషయంలో ఒకరికొకరు సహకరించుకుందామని కోరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఇరు రాష్ట్రాల అధికారులు చర్చించారు. చెక్‌పోస్టుల ఏర్పాటు, బందోబస్తు, పార్లమెంట్ ఎన్నికలు సజావుగా పూర్తయ్యేలా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.

బీటీ రోడ్లు, బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి, మార్చి 13: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పష్టం చేశారు. వాంకిడి మండలంలోని గోండుకోసర, కోపగూడ, వెల్గి, ఎనోలి, పిప్పర్‌గొంది గ్రామాల్లో ఐటీడీఏ నిధులు రూ.21 కోట్లతో మంజూరైన బీటీ రోడ్లు, బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ముండే విమలాబాయి, జడ్పీటీసీ అజయ్ కుమార్, ఎంపీటీసీ హివ్రే ప్రవీణ్, మాజీ సర్పంచులు తుకారాం, అయ్యాబ్, కిష్టు, సోనేరావు, మనోహర్, నాయకులు ముండే దీపక్, బాబూలాల్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గుర్నూలే నారాయణ, ప్రశాంత్, బీఆర్ఎస్ యువజన మండలాధ్యక్షుడు ఎంగలి రాకేశ్, శైలేష్, అశోక్, బబ్లూ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎఫ్ఆర్వో అప్పలకొండ

వేటకు వెళ్తున్నారని చితకబాదారు

- అక్కడితో ఆగకుండా రూ. 40 వేలు ఇవ్వాలని బేరసారాలు
- రూ. 25వేలకు డీల్ కుదిర్చిన మధ్యవర్తి
- వీడియో వైరల్ కావడంతో అటవీ అధికారులపై విమర్శలు
- విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ● వాంకిడి మండలంలో ఘటన

వాంకిడి. మార్చి 13: వేటకు వెళ్తున్నారనే నెపంతో అటవీ శాఖ సిబ్బంది ముగ్గురిని చితకబాది, డబ్బులు డిమాండ్ చేసిన ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని కోమటిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త దుబ్బగూడ గ్రామానికి బోయిరే మల్లయ్య, చిచోల్కర్ గణపతి, బోయిరే రమేశ్ ఐదు రోజుల క్రితం చేపల వేట కోసం వలలతో బయల్దేరారు. గ్రామ శివారులోని పోశమ్మ ఆలయం సమీపంలో వీరిని ఇద్దరు అటవీ శాఖ సిబ్బంది ఆపారు. వలలను చూసి వన్యప్రాణుల వేటకు వెళ్తున్నారంటూ చితకబాదారు. ముగ్గురినీ ఖమాన గ్రామంలోని ఓ గదిలో బంధించారు. ఆ తర్వాత ముగ్గురి దగ్గర నుంచి రూ. 40 వేలు డిమాండ్ చేశారు. బాధితులు గ్రామ మాజీ ఉపసర్పంచ్ పురుషోత్తంను ఆశ్రయించగా, ఆయన అటవీ శాఖ సిబ్బందితో మాట్లాడి రూ. 25 వేలకు బేరం కుదిరించాడు. మంగళవారం రాత్రి అటవీశాఖ సిబ్బందికి ఉపసర్పంచ్ డబ్బులు ఇస్తున్నప్పుడు తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో విషయం బయటకు పొక్కడంతో ఎఫ్ఆర్వో అప్పలకొండ బుధవారం విచారణ చేపట్టారు. బాధితులు, గ్రామస్తులతో మాట్లాడారు. వీడియో, ఆడియోను పరిశీలించారు. తప్పు తేలితే అటవీశాఖ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

15 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

- దండేపల్లి మండలం నుంచి తరలిస్తున్న నింబితులు
- జన్నారం పోలీస్ స్టేషన్ వద్ద వ్యాన్ పట్టివేత

జన్నారంలో పోలీసులు పట్టుకున్న వ్యాన్

జన్నారం, మార్చి 13: దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్ నుంచి డీసీఏం వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జన్నారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ ఎదుట ఉదయం ఈ వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వివరాలు వెల్లడించారు. నెల్కివెంకటాపూర్‌కు చెందిన శ్రావణ్, ఇంద్రవెల్లి మండలానికి చెందిన సంతోష్ వీటిని వ్యాన్(టీఎస్ 01యూసీ 5722)లో తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు చెప్పారు. వ్యాన్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనర్హులకు అందలం.. అర్హులకు మంగళం..

- శ్రీరాంపూర్ ఓసీపీ భూసేకరణలో భారీగా అక్రమాలు ● పాత ఆర్డీవో, డీటీలపై హైదరాబాద్ ప్రజావాణిలో ఫిర్యాదు
- మంచిర్యాల కలెక్టర్‌ను విచారణకు ఆదేశించిన విజిలెన్స్ ● అదనపు కలెక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో విచారణ

మంచిర్యాల, మార్చి 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ''మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ విస్తరణలో భాగంగా జైపూర్ మండలంలోని దుబ్బపల్లిలో చేసిన భూసేకరణలో భారీగా అక్రమాలు జరిగాయి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం చేసిన సోషల్ ఎకనామిక్ సర్వేలో అనర్హులకు చోటు కల్పించారు. దుబ్బపల్లిలో మొత్తం 168 ఇండ్లు ఎక్స్‌టెన్షన్‌లో పోతుంటే కేవలం 103 ఇండ్లకే పరిహారం అందించారు. ఇండ్లు పోతున్న వారిని కాదని నాన్ లోకల్స్ పేర్లను లిస్టులో చేర్చి వారికే పరిహారం అందేలా చేశారు. ఇందుకోసం ఒక్కో ఇంటికి రూ.50 వేల నుంచి రూ.లక్ష దాకా.. ఇలా రూ.50 లక్షలకు పైచిలుకు వసూలు చేశారు. మంచిర్యాలలో ఆర్డీవో ఆఫీసులో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన కమలాసింగ్ మొత్తం వ్యవహారాన్ని దగ్గరుండి నడిపించి, పాత ఆర్డీవో వేణుకు ముడుపులు అందజేశారు'' అని బాధితులు హైదరాబాద్ ప్రజావాణిలో సీఎం రేవంత్‌రెడ్డి పేరుతో ఫిర్యాదు చేశారు. పాత ఆర్డీవోకు సంబంధించి 13 అంశాలపై 150 పేజీల ఫిర్యాదు కాపీని 'నమస్తే తెలంగాణ'కు అందజేశారు. అలాగే తాళ్లపల్లి గ్రామంలో ఓసీపీ కోసం భూములు సేకరించినప్పుడు 225 మంది మేజర్స్ అని చెప్పి అక్రమంగా పరిహారం చెల్లించారన్నారు. కాకపోతే భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన సమయంలో వారంతా మైనర్లు అని ఫిర్యాదులో పేర్కొన్నారు. పునరావాస కాలనీల్లో హౌస్‌సైట్స్ కేటాయింపుల్లోనూ 11మంది అనర్హులకు స్థలాలు ఇచ్చారని, అలాగే ఇంటి పెరిట స్థలాల నష్టపరిహారాన్ని పట్టాదారులతో సంబంధం లేకుండా వేరే వారికి ఇచ్చి 60 శాతం కమిషన్ తీసుకున్నారని ఆరోపించారు. అన్నారం బ్యారేజీ భూసేకరణ కోసం 2019లో అవార్డైన భూములకు నిబంధనలకు విరుద్ధంగా సబ్ అవార్డు చేశారన్నారు. అంతటితో ఆగకుండా ఇరిగేషన్ అధికారులతో కలిసి థర్డ్ పార్టీలతో కుమ్మక్కై సదరు భూముల్లో బోర్‌వెల్స్, పైప్‌లైన్లు ఉన్నట్లు చూపించి పెద్ద ఎత్తున నిధులు మళ్లించుకున్నారన్నారు. అలాగే వివాదాల్లో ఉన్న భూములను పాత ఆర్డీవో వదలేదని ఫిర్యాదులో ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఇందారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎల్లారం శివారులోని సర్వే నంబర్ 43లో 13.06 ఎకరాల భూమిపై కోర్టులో కేసు ఉండడంతో అంతకు ముందున్న ఆర్డీవో రమేశ్ నష్టపరిహారం చెల్లింపులు నిలిపివేశారు. కానీ.. ఆర్డీవో దాసరి వేణు వచ్చాక అపోజిట్ పార్టీలకు పరిహారం చెల్లించి కమీషన్లు అందుకున్నారని ఆరోపించారు. టేకుమట్ల శివారులోని 516 సర్వే నంబర్‌లో 2.16 ఎకరాలు ఏడీసీసీబీలో 14 ఏండ్ల నుంచి మార్ట్గేజ్‌లో ఉంది. అందుకని వారికి పరిహారం చెల్లించొద్దని బ్యాంక్ అధికారులు భూసేకరణ సమయంలోనే హైకోర్టును ఆశ్రయించారు. కానీ.. వారి నుంచి కమీషన్లు తీసుకుని విషయం కోర్టులో ఉన్నా పట్టించుకోకుండా నష్టపరిహారం చెల్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విజిలెన్స్ సీరియస్.. అదనపు కలెక్టర్‌తో విచారణ..

ముఖ్యమంత్రి వరకు ఫిర్యాదు వెల్లడంతో ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీ భూసేకరణల్లో జరిగిన అక్రమాలపై స్టేట్ విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ సీరియస్‌గా ఆరా తీస్తున్నది. పాత ఆర్డీవో దాసరి వేణు, డిప్యూటీ తహసీల్దార్ కమల్ సింగ్‌పై వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ చేసి రిపోర్ట్ ఇవ్వాలని కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కోరింది. దీనిపై అదనపు కలెక్టర్ బి.రాహుల్‌ను విచారణ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. వీరిచ్చే ప్రాథమిక రిపోర్టు ఆధారంగా విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా.. ఆరోపణలు ఎదుర్కొంటున్న పాత ఆర్డీవో వేణు ప్రస్తుతం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా పని చేస్తున్నారు. ఈ విషయమై ఆయనను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ ఆన్సర్ చేయలేదు. కాగా.. ఈ ఆరోపణలన్నీ నిజమని తేలితే ఆయా ప్రాంతాల్లో గతంలో పని చేసిన ఎంఆర్‌వోలు, సింగరేణి అధికారులపైనా చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

ప్రాణం తీసుకున్న ప్రేమజంట

- ముందుగా ప్రియురాలి ఆత్మహత్య
- విషయం తెలిసిన కాసేపటికే ప్రియుడి బలవన్మరణం
- మంచిర్యాల జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటన

నాంపల్లి సంగీత, తీగుళ్ల భగవాన్(ఫైల్)

బెల్లంపల్లిరూరల్/నెన్నెల/మందమర్రి రూరల్, మార్చి 13: మంచిర్యాల జిల్లాలో ఓ ప్రేమజంట బలవన్మరణానికి పాల్పడింది. ముందుగా ప్రియురాలు ఆత్మహత్య చేసుకోగా, కాసేపటికే ప్రియుడు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలంలోని మామిడిగట్టు గ్రామానికి చెందిన నాంపల్లి గంగ, ఓదెలుకు ముగ్గురు బిడ్డలు. వీరిలో సంగీత(21) రెండో బిడ్డ. పెద్దకూతురు సంధ్యకు పెళ్లి చేయగా, అత్తవారింట్లో ఉంటున్నది. సంధ్య కొడుకు మాత్రం అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. బుధవారం అక్క కొడుకుతో సంగీత దురుసుగా ప్రవర్తించడంతో తల్లి మందలించింది. ఆ తర్వాత కూలీ పనులకు వెళ్లిన తల్లి తిరిగి వచ్చేసరికి, ఇంట్లో దూలానికి సంగీత ఉరేసుకొని కనిపించింది. కుటుంబ సభ్యులు వెంటనే సంగీతను మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విషయం తెలిసిన కాసేపటికే..

నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన తీగుళ్ల భగవాన్(23), నాంపల్లి సంగీత కొన్నాళ్లుగా ప్రేమించుకుంటున్నట్లు సమాచారం. సంగీత ఆత్మహత్య విషయం తెలుసుకున్న భగవాన్ జీర్ణించుకోలేకపోయాడు. బుధవారం సాయంత్రం తన ఆటోట్రాలీలో బెల్లంపల్లి మండలంలోని దుగినెపల్లి అటవీప్రాంతంలోకి వెళ్లి వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వీరిద్దరి బలవన్మరణంతో మామిడిగట్టు, చిత్తాపూర్ గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. భగవాన్ మృతిపై తాళ్లగురిజాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గప్పడెట్లుండే.. గిప్పడెట్లయ్యింది..

- నిర్లక్ష్యపు నీడలో బెల్లంపల్లి గ్రంథాలయం ● కుదించిన పనివేళలతో రీడర్లకు ఇక్కట్లు
- గతంలో సెలవు రోజుల్లోనూ ఓపెన్ ● అభ్యర్థులకు ఉచిత భోజనం, కోచింగ్
- రెండు నెలలుగా సమస్యల రాజ్యం ● అభ్యర్థుల వినతులు పట్టని అధికారులు

బెల్లంపల్లి శాఖ కాళోజీ గ్రంథాలయం

పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో దినపత్రికలు చదువుతున్న అభ్యర్థులు

బెల్లంపల్లి, మార్చి 13 : మళ్లీ పాత కథే మొదలైంది. సమైక్య రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన గ్రంథాలయాలు పదేళ్ల తర్వాత మరోసారి అదే బాటలో నడుస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కొత్త రూపు దిద్దుకున్న ఈ విజ్ఞాన భాండాగారాలు, తిరిగి యథాస్థితికి చేరుకుంటున్నాయి. బెల్లంపల్లి శాఖ గ్రంథాలయంలో రెండు నెలలుగా పోటీ పరీక్షల అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గతంలో పోటీ పరీక్షల సమయం లో 12 గంటలు ఉన్న గ్రంథాలయ సమయాన్ని, ప్రస్తుతం పది గంటలకు కుదించారు. అంతేకాకుండా ప్రతి శుక్రవారం, రెండో శనివారాల్లో గ్రంథాలయాన్ని మూసి ఉంచుతుండడంతో, రీడర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సీఐ కార్యాలయ ఆవరణలో..

బెల్లంపల్లి శాఖ గ్రంథాలయం మొదట సీఐ కార్యాలయం ఆవరణలో ఒకటి, రెండు గదుల్లో కొనసాగేది. కొందరు దినపత్రికలు చదవడానికి మాత్రమే ఇక్కడికి వచ్చేవారు. పట్టణానికి చెందిన చాలా బస్తీలకు దూరంగా ఉండడంతో ఇక్కడి రావడానికి విముఖత చూపేవారు. ఆ తర్వాత 2016లో గ్రంథాలయాన్ని బజార్ ఏరియాలోని పాత క్లబ్ పాఠశాలలోకి మార్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రేణికుంట్ల ప్రవీణ్ బాధ్యతలు తీసుకున్నాక, జిల్లా వ్యాప్తంగా బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్‌లోని గ్రంథాలయ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని సంబంధిత మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మిగతా గ్రంథాలయాలతో పాటు బెల్లంపల్లి గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరయ్యాయి. మహిళలు, పురుషులకు వేర్వేరుగా రీడింగ్ రూములు ఏర్పాటు చేశారు. దినపత్రికలు చదివే వారి కోసం మరో హాల్‌ను నిర్మించారు. రెండు హాళ్లలో ఏసీ సౌకర్యం, పాఠకులకు సౌకర్యంగా ఉండే కుర్చీలను ఏర్పాటు చేశారు.

మళ్లీ మొదలైన కష్టాలు...

ఇటీవల ప్రభుత్వం పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో గ్రంథాలయానికి అభ్యర్థులు వస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పని వేళలు ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు స్వీపర్ గ్రంథాలయం తెరిచినా, లైబ్రరీయన్ వచ్చాక 11 గంటల నుంచి పుస్తకాలు ఇస్తున్నారని అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక గతంలో ప్రతి శుక్రవారం, రెండో శనివారం కూడా గ్రంథాలయాన్ని తీసి ఉంచేవారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణ శిబిరంతో పాటు ఉచిత భోజన సదుపాయం కూడా కల్పించారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. డిప్యూటేషన్‌పై ఉన్న లైబ్రేరియన్ ప్రతి బుధవారం కాసిపేట లైబ్రరీకి వెళ్తుండడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. లైబ్రేరియన్ సెలవుపై వెళ్లినా, తమకు పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అదనపు కలెక్టర్ రాహుల్ గ్రంథాలయాన్ని సందర్శించినప్పుడు అభ్యర్థులు ఇక్కడి సమస్యలను ఆయన దృష్టికి కూడాతీసుకువచ్చారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు కూడా వినతిపత్రం సమర్పించారు. అయినా కూడా పరిష్కారం కాకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పనివేళలు పెంచాలి

బెల్లంపల్లి గ్రంథాలయం రోజూ ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు తెరిచి ఉంచాలి. ప్రస్తుతం నిరంతరం చదవాల్సి ఉంటుంది. గ్రంథాలయం సాయంత్రం ఆరు గంటల వరకే ఉంచుతున్నారు. సబ్జెక్ట్‌పై పట్టు సాధించాలంటే, గ్రంథాలయంలో చదవాలి. ఉదయం 8 గంటలకు గ్రంథాలయాన్ని తెరిచినా, పుస్తకాలు ఇవ్వడం లేదు. గ్రంథాలయాన్ని 12 గంటల పాటు తీసి ఉంచాలి.

- పురంశెట్టి నరేశ్, అభ్యర్థి

ఉచిత కోచింగ్ ఇప్పించాలి

గతంలో లాగే పోటీపరీక్షల నోటిఫికేషన్లు విడుదలైనప్పుడు ఉచిత కోచింగ్ ఇచ్చేవారు. మూడు నెలలు నిష్ణాతులైన ఫ్యాకల్టీతో తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం కూడా అదేవిధంగా కోచింగ్ ఇవ్వాలి. అంతేకాకుండా సుదూరప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బందులు పడకూడదని ఉచిత భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు కూడా అదే విధంగా భోజన సౌకర్యం కల్పించాలి. అప్‌డేట్ స్టడీ మెటీరియల్‌ను అందించాలి. 12 గంటల పాటు గ్రంథాలయం తెరిచి ఉంచాలి.

- బత్తుల కమల్, అభ్యర్థి

ప్రతి శుక్రవారం పని చేయాలి

ప్రతి శుక్రవారం, రెండో శనివారం గ్రంథాలయాన్ని మూసి ఉంచుతున్నారు. ఈ విలువైన నాలుగు నెలల పాటు పండుగ సెలవులు కాకుండా ఇతర సెలవులు లేకుండా గ్రంథాలయాన్ని తెరిచి ఉంచాలి. ప్రతి రోజు క్రమం తప్పకుండా వచ్చి ప్రిపేర్ అవుదామనుకుంటే ఈ సెలవులతో ప్రిపరేషన్‌పై ఉన్న శ్రద్ధ పోతున్నది. సెలవు దినాల్లో ఇంట్లో చదువుకుందామంటే ఇంతటి ప్రశాంత వాతావరణం అక్కడ ఉండదు. గ్రంథాలయంలో ఉన్న సమస్యలపై ఇప్పటికే జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి కూడా తీసుకెళ్లాం.

- తాటిపాముల నరేశ్, అభ్యర్థి

ఐబీ చౌరస్తా..ఇక అంబేద్కర్ చౌరస్తా

- మంచిర్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం ● బహుళ అంతస్థుల్లో కూరగాయల మార్కెట్ నిర్మాణం
- లక్ష్మీ టాకీస్ చౌరస్తా నుంచి సున్నంబట్టి వాడ వరకు రోడ్డు ఆర్‌అండ్‌బీకి అప్పగింత

మాట్లాడుతున్న చైర్మన్ ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్, మార్చి 13: మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాను ఇకపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తాగా పేరు మార్చుతూ మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. మంచిర్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ రావుల ఉప్పలయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. దీంతో పాటు ఇక్కడున్న విగ్రహం స్థానంలో మరింత పెద్ద విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని, జంక్షన్‌లో సుందరీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతమున్న కూరగాయల మార్కెట్ స్థానంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు కేటాయించిన నిధులతో బహుళ అంతస్థుల్లో మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. పట్టణంలోని లక్ష్మీ టాకీసు చౌరస్తా నుంచి రైల్వే లైను మీదుగా గోపాల్‌వాడ, సున్నంబట్టి వాడ వరకు ఉన్న 100 ఫీట్ల రోడ్డును ఆర్‌అండ్‌బీకి అప్పగించి రోడ్డు, ఫ్లైవర్ నిర్మాణాన్ని చేపట్టాలని కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఇంజినీరింగ్ విభాగంలో అభివృద్ధి పనులకు రూ. 6 కోట్లు, పారిశుధ్య విభాగం, వాహనాల రిపేర్లు, జీతభత్యాలు, ఇతర కొనుగోళ్లకు రూ. 70 లక్షలు, పరిపాలనా విభాగంలో సిబ్బంది జీతభత్యాలకు రూ. 1.35 కోట్లు చెల్లించేందుకు కౌన్సిల్ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. గోదావరి దగ్గరలో ఉన్న మాతా శిశు దవాఖాన ఐబీ చౌరస్తాలో ఉన్న ఆర్‌అండ్ బీ స్థలంలోకి మార్చాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ సల్ల మహేశ్, కమిషనర్ మారుతీప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్, మున్సిపల్ ఇంజినీర్ మధుకర్, ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సునీల్‌రాథోడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలి

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మార్చి 13: జిల్లా వార్షిక రుణ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేలా బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం మహ్మద్ జయూర్ రహమాన్, యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం సురేశ్, నాబార్డు డీడీఎం అబ్దుల్ రవూఫ్, గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీ మోహన్‌రావుతో కలిసి బ్యాంకుల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రుణప్రణాళిక లక్ష్యం రూ. 4,625 కోట్లు నిర్దేశించినట్లు, సాధించే దిశగా అధికారులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. రుణాలు పొందిన వారు సకాలంలో చెల్లించి కొత్తవి పొందేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.